## క్లుప్తంగా

### 28 చౌక దుకాణాల్లో సరుకుల పంపిణీకి శ్రీకారం

రొంపిచెర్ల: మండలంలో 8,118 బియ్యం కార్డులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేసేందుకు 28 చౌక దుకాణాలను రెవెన్యూ అధికారులు సిద్ధం చేశారు. రేషన్ షాపులలో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, ఆ తర్వాత మధ్యాహ్నం 4–8 గంటలకు సరుకులను పంపిణీ చేస్తారని, కార్డుదారులందరూ చౌక దుకాణాల్లో సరుకులు తీసుకోవాలని తహసీల్దార్ కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెలా 1 నుంచి 15వ తేది వరకు చౌక దుకాణాలు పని చేస్తాయని పేర్కొన్నారు.

### పుదిపట్ల వాసికి పీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు

చౌడేపల్లె: రాజంపేట ఎంపీ పీవీ.మిథున్‌రెడ్డి సిఫార్సు మేరకు పీఎం రిలీఫ్ ఫండ్ రూ.50 వేలు మంజూరు చేసినట్లు ఎంపీ కార్యాలయం నుంచి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. మండలంలోని పుదిపట్లకు చెందిన వై.ఉదయ్‌కుమార్ గుండె శస్త్రచికిత్సకు చేయూతనివ్వాలని ఇటీవల ఎంపీని కలిసి విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎంపీ ప్రధానమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం మంజూరు చేయించారు.

### కాపునాడు నియోజకవర్గ అధ్యక్షుడిగా హరికుమార్



బైరెడ్డిపల్లి: కాపునాడు పలమనేరు నియోజకవర్గ అధ్యక్షుడిగా బైరెడ్డిపల్లెకు చెందిన డి.హరికుమార్‌ను కాపునాడు జాతీయ అధ్యక్షుడు సుబ్రమణ్యం నియమిస్తూ నియామక పత్రం పంపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కాపుల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని, కాపుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు పాటుపడతానని హరికుమార్ తెలిపారు.

### యువకుడు అదృశ్యం



గణేష్

పెద్దపంజాణి : పెద్ద పంజాణి సత్రానికి చెందిన నాగరాజు కుమారుడు గణేష్ (26) సోమవారం ఉదయం సోదరి గిరిజమ్మ ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి కనిపించకుండా పోయాడు. బంధువులు, స్నేహితులను విచారించినా ఆచూకీ తెలియలేదు. దీంతో తల్లి దాక్షాయణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ చంద్రబాబు తెలిపారు.

### వేసవి క్రీడల శిక్షణ శిబిరం ప్రారంభం

కార్వేటినగరం: విద్యార్థులు గ్రామీణ స్థాయిలో నిర్వహించే క్రీడలను సద్వినియోగం చేసుకుని జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని వైఎస్ఆర్ సీపీ మండల యువ నాయకుడు తౌకీర్‌ఖాన్ అన్నారు. మంగళవారం డైట్ ఆవరణలో శాప్ ఆధ్వర్యంలో సమ్మర్ క్రీడా శిక్షణ శిబిరాన్ని తౌకిర్ ఖాన్ ప్రారంభించారు.

# విత్తనాలెప్పుడిస్తారు సామీ..?

జిల్లాలోనే వేరుశనగ సాగు ఎక్కువగా ఉన్న ప్రాంతం పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్. వర్షాధారంపై ఆధారపడి ఇక్కడ మెట్టభూముల్లో రైతులు ఖరీఫ్‌లో సీజన్‌లో ఎక్కువగా వేరుశనగ సాగు చేస్తుంటారు. నైరుతి రుతు పవనాలు ముందుగానే పలకరించడంతో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు దుక్కులు దున్నకాల పనుల్లో నిమగ్నమయ్యారు. అయితే ప్రభుత్వం ఇప్పటివరకూ విత్తనకాయల ధర నిర్ణయించకపోగా ఎప్పటి నుంచి పంపిణీ చేస్తుందో కూడా తెలియడం లేదు.

- పలకరించిన నైరుతి రుతుపవనాలు
- వేరుశనగ సాగుకు సిద్ధమైన రైతన్నలు
- ఈ పర్యాయం డివిజన్‌కు కేవలం ఏడువేల క్వింటాళ్లు మాత్రమే కేటాయింపు
- గత ప్రభుత్వ హయాంలో 10,380 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ
- ఇప్పటివరకూ ధర ప్రకటించని ప్రభుత్వం
- ఇక విత్తనాల పంపిణీ ఎన్నడో..?



దుక్కులు దున్నుతున్న రైతు

పలమనేరు: పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్‌లో కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లోని ఏడు మండలాలున్నాయి. ఇక్కడ వేరుశనగ సాధారణ సాగు 14,388 వేల హెక్టార్లు. 12వేల క్వింటాళ్ల విత్తనకాయల అవసరం ఉంది. గత ప్రభుత్వం సకాలంలోనే 10,380 క్వింటాళ్ల కే–6 రకం విత్తనాలను పంపిణీ చేసింది. కానీ కూటమి పాలనలో విత్తన కాయల ధర సైతం ఇంకా నిర్ణయించలేదు. మరో వైపు విత్తనాలు ఎప్పుడిస్తారా? అని రైతులు ఎదురు చూస్తున్నారు. ఈసారి వేరుశనగ సాగు పెరిగే అవకాశం ఉంది. కానీ పలమనేరు డివిజన్‌కు కేటాయించింది కేవలం 7వేల క్వింటాళ్లు మాత్రమే. ఇవి ఏమాత్రం సరిపోవనే రైతులు అంటున్నారు.

**ఊసే లేని పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ**

ఇలా ఉండగా వేరుశనగ సాగుచేసే భూముల్లో ముందుగానే పచ్చిరొట్ట విత్తనాలను వ్యవసాయశాఖ రైతులకు 50 శాతం సబ్సిడీతో ఆర్‌బీకేల ద్వారా గత ప్రభుత్వ పాలనలో పంపిణీ చేసేది. జనుము, జీలుగ, పిల్లిపెసర, తదితర విత్తనాలను వేరుశనగ విత్తనకాయలకంటే ముందుగా ఇచ్చేవారు. దున్నకాలలోనే ముందుగా భూమిలో వీటిని కలియదున్నితే భూమిలో సత్తువ పెరిగి పంట దిగుబడి పెరగడానికి ఇది దోహదం చేసేది. కూటమి ప్రభుత్వం వీటి ఊసే ఎత్తడం లేదు.



గత ప్రభుత్వంలో జనంతో కిటకిటలాడుతున్న పలమనేరులోని ఓ సచివాలయం (ఫైల్)



కూటమి పాలనలో సచివాలయంలో సిబ్బంది లేకుండా ఉన్న పెద్దపంజాణి మండలంలోని మాడి సచివాలయం



బైరెడ్డిపల్లెలో వెలవెలబోతున్న సచివాలయాలు, ఆర్‌బీకే

**అదనంగా మరో ఏడువేల క్వింటాళ్లు అడిగాం**

వేరుశనగ విత్తనాలు కొన్ని మండలాల్లోని గోడౌన్లకు వస్తున్నాయి. సబ్సిడీ ధర నిర్ణయం కూడా ఇంకా ప్రకటించలేదు. గ్రౌండింగ్ ప్రక్రియ మొత్తం పూర్తయ్యాక జూన్‌లో పంపిణీ ఉంటుంది. ఇక్కడికి 7వేల క్వింటాళ్ల అలాట్‌మెంట్ వచ్చింది. అయితే విత్తనాలు చాలవని డివిజన్‌కు మరో 7వేల క్వింటాళ్లు కావాలని ఉన్నతాధికారులకు చెప్పాం.

–గీతాకుమారి, వ్యవసాయశాఖ ఏడీ, పలమనేరు

**ముందుగా ఇస్తే విత్తనాలను ఒలిచి పెట్టుకుంటాం**



గతంలో ముందుగా 50శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలు ఇచ్చేవాళ్లు. ఈసారి ఏమీ ఇవ్వలేదు. విత్తన కాయలను ముందుగా ఇస్తే వాటిని ఒలిచి పెట్టుకుంటాం. అయితే విత్తనాలు ఎప్పుడు ఇస్తారో కూడా అర్థం కావడం లేదు. మాకు మాత్రం కష్టాలు తప్పడం లేదప్పా.

–రెడ్డెప్పరెడ్డి, రైతు, జగమర్ల

**ఇప్పుడు పల్లెల్లో ఏ సేవలూ లేవు!**



గ్రామాల్లోనే ప్రజలకు 540 రకాల సేవలు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో అందేవి. దీంతో ఆయా సచివాలయాలు జనంతో కిటకిటలాడేవి. కూటమి ప్రభుత్వంలో ఈ సేవలన్నీ లేవు. సచివాలయాల సిబ్బందిని సర్వేలకు పంపుతుండడంతో అక్కడ ఎలాంటి సేవలు లేకుండాపోయాయి. ఆ భవనాలను చూస్తే మాకే బాధేస్తోంది.

విజయకుమార్ స్వామి, కీలపట్ల, గంగవరం మండలం



గత ప్రభుత్వంలో రైతుల సేవలో మొరం ఆర్‌బీకే (ఫైల్)

**సేవల కోసం మండల కేంద్రానికి పరుగు**



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాకు రకరకాల సర్వేలను అప్పగించారు. దీంతో సచివాలయంలో కంటే ఫీల్డ్‌లో ఎక్కువగా ఉండాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు ఆదేశాలను మే పాటించాల్సిందే కదా! దీంతో ఎలాంటి సేవలు కావాలన్నా ప్రజలు మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది.

–మురళీనాథ్, రాష్ట్ర సచివాలయాల సంక్షేమ సంఘ ఉపాధ్యక్షుడు

**ప్రభుత్వానికి శాపనార్థాలు**



మా ఊరు అడవిలో ఉంది. పట్టణానికి 15 కిలోమీటర్ల దూరం. ఏదైనా సర్టిఫికెట్ కావాలంటే గతంలో ఇక్కడి సచివాలయంలో ఇచ్చేవారు. రేషన్ బియ్యం బండి రాదు.. కాబట్టి పలమనేరువెళ్లి రేషన్ తీసుకోవాలి. ఇక గతంలో వస్తున్న సంక్షేమ పథకాలు ఇప్పుడు లేవు. సూపర్ సిక్స్ హామీలు నమ్మి మోసపోయామని ప్రజలు ప్రభుత్వాన్ని శపిస్తున్నారు.

–విజయకుమార్, సర్పంచ్, జగమర్ల

## నోటీస్ బోర్డు

**● 29న పుంగనూరు మున్సిపల్ సమావేశం**

చౌడేపల్లె: మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం ఈనెల 29న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు పుంగనూరు మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా మంగళవారం తెలిపారు. ఈ సమావేశంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రస్తుతం కరోనా వ్యాపిస్తుండటంతో తీసుకోవాల్సిన ముందుజాగ్రత్త చర్యలపై చర్చిస్తామని, సభ్యులు, అధికారులు అధికారులు హాజరు కావాలని కోరారు.

**● 29 నుంచి గోళ్లపల్లెమ్మ తిరునాళ్ల**

రొంపిచెర్ల: ఈ నెల 29 నుంచి జూన్ 1వ తేది వరకు మండలంలోని గానుగచింత దాసరిగుండెంలో గోళ్లపల్లెమ్మ తిరునాళ్ల నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. 29న 2 గంటల నుంచి ఆసాదివారికథ, రాత్రి 8–12 గంటల వరకు తిరుపతికి చెందిన కోటి ఈవెంట్స్ నృత్య ప్రదర్శన, 30న రేలారే రేలా జానపద గీతాలు, నృత్యాలు, టీవీ గాయకులు దామోదర గణపతి రావు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 31న పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు, జూన్1న రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహిస్తామని తెలియజేశారు.

## ఎయిడ్స్‌పై అవగాహన



ఎయిడ్స్‌పై అవగాన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గుడిపాల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై కళాకారుల బృందం అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఎయిడ్స్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలియజేశారు. బయట వ్యక్తులతో వివాహేతర సంబంధాలు పెట్టుకోకుండా నియంత్రించుకోవాలని సూచించారు. ఎయిడ్స్‌ను నివారించేందుకు వైద్యపరమైన వ్యాక్సిన్ లేదని నివారణే దీనికి అందుబాటులో ఉన్న టీకా అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సంధ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బాలసూర్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ విజయ పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిస్పెన్సరీ తనిఖీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం ఆర్టీసీ బస్టాండు ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న డిస్పెన్సరీని ఎండీ ద్వారక తిరుమలరావు మంగళవారం తనిఖీ చేశారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తర్వాత బస్టాండును పరిశీలించారు. ఉద్యోగులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఏడీఏ అప్పలరాజు, ఏడీఈ చెంగల్‌రెడ్డి, డీపీటీఓ జగదీష్ తదితరులున్నారు.

## యోగాడేపై అవగాహన ర్యాలీ



యోగాంధ్రపై గోకుల్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన మానవహారం

చౌడేపల్లె: ప్రజలు క్రమం తప్పకుండా యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని పుంగనూరు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. జూన్ 21న యోగాడే పురస్కరించుకుని నిర్వహించే కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం సీఐ సుబ్బరాయుడు, డాక్టర్ గౌరి, ఇందిరక్రాంతి పథం మహిళలు, వైద్య సిబ్బందితో కలసి పుంగనూరులో ఇందిరా సర్కిల్ నుంచి గోకుల్ సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం శ్రీకారం చుట్టిన యోగాంధ్రలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం గోకుల్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేశారు.

## కృత్తిక పూజలు



ప్రత్యేకాలంకారంలో వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి

సదుం: కృత్తిక నక్షత్రం పురస్కరించుకుని స్థానిక వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యా స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అభిషేకాలు, అర్చన, విశేషాలంకారం చేశారు. సమీప ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

## 108 వాహన సిబ్బంది సంబరాలు



కేక్ కట్ చేస్తున్న 108 సిబ్బంది

వి.కోట: ప్రాణాలు ఫణంగా పెట్టి రేయింబవళ్లు అనే తేడా లేకుండా ఎంతో మంది ప్రాణాలను కాపాడుతున్నామని 108 అంబులెన్సు పైలెట్లు(డ్రైవర్లు) అన్నారు. మంగళవారం పైలెట్ డే పురస్కరించుకుని మండల 108 వాహనాల సిబ్బంది వార్షికోత్సవం నిర్వహించారు. మంగళవారం మండలం కేంద్రంలో పలమనేరు, గంగవరం, వి.కోట 108 సిబ్బంది కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది బాబు, మైఖేల్, దీనా, రాజేష్, పురుషోత్తం, భవానీ, నగ్మా తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సల్లాపురెమ్మ పుష్పపల్లకి



అమ్మవారిని దర్శించుకున్న డీసీసీబీ మాజీ చైర్ పర్సన్ మొగసాల రెడ్డెమ్మ



విద్యుత్‌దీపాలతో అలంకరించిన అమ్మవారి పుష్పపల్లకి

బైరెడ్డిపల్లె: స్థానిక ఎస్సీ కాలనీలోని శ్రీ సల్లాపురెమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న జాతరలో భాగంగా మంగళవారం రాత్రి వైభవంగా పుష్పపల్లకి ఊరేగింపు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ప్రత్యేక వాహనంపై రంగురంగుల పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించి అమ్మవారిని కొలువుదీర్చారు. గ్రామ వీధుల్లో బాణసంచా మోత, మేళతాళాల నడుమ ఊరేగించారు. ఊరేగింపులో పూల గెరిగ ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. డీసీసీబీ మాజీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ, మాజీ ఎంపీపీ మొగసాల శోభ, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

## ఉగ్రవాదమే దేశానికి పెనుభూతం




పట్టణంలో సమైక్యతా ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

పలమనేరు: దేశానికి ఉగ్రవాదం పెనుభూతంగా మారిందని, ఉగ్రవాదం నశిస్తేనే దేశం మరింతగా అభివృద్ధి చెందుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు అన్నారు. పలమనేరులో మంగళవారం సీపీఎం నాయకులు, కార్యకర్తలు దేశ సమైక్యతా ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఇటీవల కాశ్మీర్‌లోని పెహల్గాంలో జరిగిన ఉగ్ర దాడి ఘటన దేశ ప్రజల రక్తం మరిగిలా చేసిందని, దీనికి కేంద్రం కూడా అదే స్థాయిలో ఉగ్రవాదానికి ఫ్యాక్టరీగా మారిన పొరుగు దేశంపై దాడులకు దిగి తగిన బుద్ధి చెప్పిందన్నారు. ప్రపంచ దేశాలు కూడా ఉగ్రవాదంపై సమష్టి పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అగ్రరాజ్యమైన అమెరికా వ్యాపారం కోసం ఇండియా, పాకిస్థాన్‌లతో రాజకీయం చేస్తోందని విమర్శించారు. ఇండియాపై ట్రంప్ పెత్తనం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు గిరిధర్‌గుప్తా, లక్ష్మయ్య, ధనలక్ష్మి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## మమ్మేలు తల్లీ.. గంగమ్మా..!



విశేషాలంకరణలో పాలేటమ్మ

ఐరాల: మండల కేంద్రంలోని గ్రామదేవత శ్రీ పాలేటమ్మ ఆలయంలో గంగ జాతర మంగళవారం ఆలయ వంశ పార్యంపర ధర్మకర్త, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా ప్రారంభమైంది. వేకువజామున ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో అమ్మవారి ప్రతిమ కొలువుదీర్చారు. ఉదయం 6 గంటలకు అమ్మవారి తెర తీసి, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అమ్మవారి విశ్వరూప దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం అమ్మవారి మూలవిగ్రహం, ఉత్సవ మూర్తులను వివిధ రకాల సుగంధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామ వీధులను వేపాకు తోరణాలతో అలంకరించారు. వీఎస్.అగ్రహారం నుంచి బజారువీధి వరకు రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు. ఉదయం 9 గంటలకు ప్రత్యేక వాయిద్యాల నడుమ మహిళలు అంబలితో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. పూజారులు అమ్మవారికి అంబలిని నైవేద్యంగా సమర్పించి భక్తులకు ఇచ్చారు. మధ్యాహ్నం 12 గంటలకు మహిళలు పెద్ద ఎత్తున ఆలయానికి వచ్చి పొంగళ్లు అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. సాయంత్రం మహిళలు పిండి దీపాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. రాత్రి భక్తుల కాలక్షేపం కోసం ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



అమ్మవారికి అంబలి సమర్పిస్తున్న మహిళలు

## తెనాలి పోలీసుల దాష్టీకంపై నిరసన



అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న అశోక్ తదితరులు

- దళిత, ముస్లిం యువకులను కొట్టిన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్

చౌడేపల్లె: తెనాలి ఐతేనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దళిత ముస్లిం యువకులను దారుణంగా లాఠీలతో నడిరోడ్డుపై కొట్టిన పోలీస్ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎన్ఆర్ అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పుంగనూరులోని అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఐతేనగర్ పోలీస్‌స్టేషన్ యువకులను దారుణంగా కొట్టడం దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. దీనికి బాధ్యులైన సీఐలు రాములునాయక్, సురేష్‌బాబును వెంటనే సస్పెండ్ చేసి, వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగానికి బదులు పోలీస్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని, దీనిపై కోర్టు కూడా సుమోటోగా స్వీకరించి విచారణకు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. బాధ్యులైన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, గంగా, నాగ, ఆనంద, భాస్కర్, అజయ్, మంజు, వంశీ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ హైరోడ్డు పనులు మొదలు



అడ్డంకులను తొలగిస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్: నగరంలో మంగళవారం మళ్లీ హైరోడ్ విస్తరణకు పనులు ప్రారంభమయ్యాయి. రోడ్డు విస్తరణలో భాగంగా ఇప్పటివరకు ప్రభుత్వ స్థలాల్లో సమస్యలను పరిష్కరించిన నగరపాలక సంస్థ, మరో అడుగు ముందుకు వేసింది. అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర నేతృత్వంలో కట్టమంచి మార్గంలో విస్తరణ పనులను ప్రారంభించారు. జేసీబీలతో విస్తరణ రోడ్డుకు సరిపడా స్థలానికి ఉన్న అడ్డంకులను తొలగిస్తున్నారు. ఈ పనులను నగర మేయర్ అముద పర్యవేక్షించారు.

## ఘనంగా గంగజాతర



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

గుడిపాల: మండలంలోని కుప్పిగానిపల్లెలో మంగళవారం ఘనంగా గంగజాతరను గ్రామస్తులు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లి అంబలిపోసి మొక్కులు చెల్లించారు. సాయంత్రం పొంగళ్లు పెట్టారు. జాతరలో మాజీ సైనికులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.